సాక్షి అనంతపురం

శనివారం । 28 । జనవరి । 2023



టన్ను చీనీ రూ.30 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.6, సరాసరి ధర రూ.12 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం

31.8°/12.5°

జిల్లా అంతటా శుక్రవారం చలి స్వల్పంగా పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి.

న్యూస్‌రీల్

30 నుంచి సర్వజనాస్పత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్



అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఈ నెల 30 నుంచి రెండు రోజుల పాటు క్యాన్సర్‌పై స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు రేడియోథెరపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంతి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా రెండు రోజుల పాటు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్)పై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 30 ఏళ్ల పైబడిన స్త్రీలు ఈ పరీక్షకు అర్హులన్నారు. వీరు ఆస్పత్రిలోని ఓపీ నంబర్ 6లో సంప్రదించాలన్నారు. సర్వైకల్ క్యాన్సర్‌ను తొలి దశలోనే కనుగొనేందుకు స్క్రీనింగ్ పరీక్షలు ఎంతో దోహదపడతాయన్నారు.

మూడు రైళ్లలో దోపిడీ

గుంతకల్లు: దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. గంటల వ్యవధిలో.. మూడు రైళ్లలో ప్రయాణికుల వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదును దోచుకుపోయారు. ఈ వరుస ఘటనలు గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు, ప్రయాణికులను బెంబేలెత్తించాయి. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది మధ్య సమన్వయ లోపం, ఉన్నతాధికారుల నిస్సహాయత కొట్టొచ్చినట్టు కనిపించాయి. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (నం–12627) గుంతకల్లు జంక్షన్‌లో గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో బయల్దేరింది. ఆ రైలులో కిటికీ పక్కన కూర్చున్న గుల్బర్గకు చెందిన జయలక్ష్మి అనే ప్రయాణికురాలు మెడలోని 6.5 తులాల బంగారు చైన్‌ను దుండగుడు లాక్కొని పారిపోయాడు. యశ్వంత్‌పూర్ – బీదర్ వెళ్తున్న మరో ఎక్స్‌ప్రెస్ (16571) రైలులోనూ ఇదే తరహాలో జగదాంబ అనే ప్రయాణికురాలి మెడలో 3.5 తులాల బంగారు మంగళసూత్రం లాక్కెళ్లారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో గుంతకల్లు జంక్షన్ నుంచి బయలుదేరుతున్న షోలాపూర్–హసన్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ (11312) రైలులోని ప్రవీణ్ (గుల్బర్గ) ప్రయాణికుడి వద్ద దాదాపు 60 తులాల బంగారు నగలతోపాటు రూ.30వేలు నగదుతో కూడిన బ్యాగ్‌ను సేఫ్టన్ కౌంటర్‌లో ఓ దుండగుడు లాక్కుని ఉడాయించాడు. బాధితులు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు వన్ మ్యాన్ కమిషన్ రాక

అనంతపురం అర్బన్: బెంట ఒరియా, బోయ, వాల్మీకుల సమస్యల అధ్యయనానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐ.శామ్యూల్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలోని వన్ మ్యాన్ కమిషన్ శనివారం జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం నిర్వహిస్తారని, బెంట ఒరియా, బోయ, వాల్మీకుల కులాల ప్రజలు, నాయకులు, సంఘాలు, ప్రజాప్రతినిధులు తదితరుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఆయా వర్గాల వారు హాజరై వన్‌మ్యాన్ కమిషన్‌కు వినతిపత్రాలు సమర్పించవచ్చన్నారు.

నగరాభివృద్ధికి రూ.25 కోట్లు



ప్రారంభానికి సిద్ధమైన 'జగనన్న వారధి'

అనంతపురం క్రైం: అనంతపురం నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోంది. ఇప్పటికే నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తాజాగా రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి పరిపాలన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో నగరంలోని పలు ప్రాంతాల్లో బీటీ, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు నిర్మించనున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, మురికివాడలైన భాగ్యనగర్, బిందెలకాలనీ, భవానీనగర్, రాణీనగర్, తదితర ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే అనంతపురం అభివృద్ధి సాధ్యమవుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. తాజాగా నిధులు మంజూరు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'జగనన్న వారధి' ప్రారంభం

అనంతపురం సిటీ : నగర శివారులోని రాజీవ్ కాలనీకి వెళ్లే మార్గంలో నడిమివంకపై సుమారు రూ.3.36 కోట్లతో నిర్మించిన వంతెన (జగనన్న వారధి) ప్రారంభానికి ముస్తాబైంది. శనివారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ లాంఛనంగా ప్రారంభించనున్నారు. దీనివల్ల రాజీవ్‌కాలనీ వాసులకు రవాణా కష్టాలు పూర్తిగా తొలగిపోనున్నాయి.



మడకశిర సమీపంలో సాగులో ఉన్న మల్బరీ తోట



హిందూపురం మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన పట్టుగూళ్లు

మనమే టాప్

ఉద్యాన పంటలకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు రాష్ట్రంలోనే పేరెన్నికగన్నవి. కానీ ఈ రెండు ఇప్పుడు మల్బరీ సాగులోనూ మొదటి వరుసలో నిలిచాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ఉత్పత్తయ్యే పట్టు అత్యంత నాణ్యమైనది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే పట్టుకు దేశీయంగా మంచి మార్కెట్ ఉంది. రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణంలో మల్బరీ పండించే జిల్లాల్లో శ్రీసత్యసాయి మొదటి స్థానంలో ఉండగా.. అనంతపురం జిల్లా నాలుగో స్థానంలో ఉంది. అంతర్జాతీయంగానూ ధర్మవరంలో తయారయ్యే పట్టుచీరలకు ఎంత ఖ్యాతి ఉందో అందరికీ తెలిసిందే.

- మల్బరీ, పట్టులో 'ఉమ్మడి అనంత' పైచేయి
- రాష్ట్రంలోనే అత్యధికంగా మల్బరీ సాగు శ్రీసత్యసాయి జిల్లాలోనే..
- మల్బరీ సాగులో అనంతపురం జిల్లా నాలుగో స్థానం
- నాణ్యమైన పట్టుగూళ్లకు పేరుగాంచిన పురం మార్కెట్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మనరాష్ట్రంలో శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిర, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం ప్రాంతాలతో పాటు అనంతపురం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మల్బరీ సాగు భారీ విస్తీర్ణంలో ఉంది. ఒక్క శ్రీసత్యసాయి జిల్లాలో 26వేల మంది రైతులు 44,487 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నట్టు పట్టుపరిశ్రమ శాఖ అంచనా. చిత్తూరులో 39,849 ఎకరాల్లోనూ, అన్నమయ్య జిల్లాలో 12,839 ఎకరాల్లోనూ పండిస్తుండగా, 6,740 ఎకరాల్లో మల్బరీ సాగుచేస్తూ అనంతపురం జిల్లా నాల్గో స్థానంలో నిలిచింది. శ్రీసత్యసాయి జిల్లాలో 26వేల పైచిలుకు మల్బరీ రైతులుండగా, అనంతపురం జిల్లాలో 8,500 మంది ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఉత్పత్తి అవుతున్న పట్టుగూళ్లు అత్యంత నాణ్యమైనవిగా పేరుంది. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ధర్మవరం పట్టుగూళ్లు కిలో రూ.607 పలుకుతున్నాయి.



మల్బరీ సాగులో రాష్ట్రంలో టాప్ 6 జిల్లాలు

జిల్లా	మల్బరీ సాగు (ఎకరాల్లో)
శ్రీ సత్యసాయి	48,487
చిత్తూరు	39,849
అన్నమయ్య	12,839
అనంతపురం	6,740
ప్రకాశం	3,731
కాకినాడ	3,003

పట్టుగూళ్ల మార్కెట్‌లో ధరలు ఇలా...

ప్రాంతం	పట్టుగూళ్ళు ధర (కిలో)
హిందూపురం	రూ.594
కదిరి	రూ.579
ధర్మవరం	రూ.607
పలమనేరు	రూ.592
మదనపల్లె	రూ.615
హనుమాన్ జంక్షన్	రూ.436
చేబ్రోలు (కాకినాడ)	రూ.470
కుప్పం	రూ.613

పట్టుగూళ్ల ధర ఆశాజనకం



రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేశాం. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాం. బైవోల్టిన్ పట్టుగూళ్లు పెంచాం. దిగుబడి బాగా వచ్చింది. పట్టు గూళ్ల ధర కూడా ఆశాజనకంగా ఉంది. కిలో రూ.700పైగా పలికింది. రెండు ఎకరాలకు రూ.లక్షదాకా లాభం వచ్చింది.

– రంగనాథ్, రైతు, రొళ్ల

మల్బరీ సాగు లాభదాయకం



కొన్నేళ్లుగా పట్టు పరుగులు పెంచుతున్నా. రెండెకరాల్లో మల్బరీ సాగు చేశా. ఏటా ఐదు నుంచి ఆరు పంటలు తీసుకుంటా. ఒక పంటకు ఖర్చు పోను రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది. మల్బరీ నర్సరీని కూడా ఏర్పాటు చేశా. నర్సరీ ద్వారా కూడా ఆదాయం వస్తోంది.

– నారాయణప్ప, వి.అగ్రహారం, అమరాపురం

మల్బరీ విస్తీర్ణం పెంపునకు కృషి



హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ రాష్ట్రంలోనే అతి పెద్దది. సగటున రోజుకు 6వేల కిలోల పట్టుగూళ్లు వస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి, ధర్మవరంలో కూడా పట్టుగూళ్ల మార్కెట్లు ఉన్నాయి. ఇప్పటికే మల్బరీ సాగు విస్తీర్ణం గణనీయంగా ఉంది. దీన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తాం.

– పద్మమ్మ, పట్టు పరిశ్రమ శాఖ జేడీ, శ్రీసత్యసాయి జిల్లా

అసత్య ప్రచారాలపై 'ఫ్యాక్ట్' చెక్

- 99898 19191కు వాట్సాప్ చేసి నివృత్తి చేసుకోవచ్చు



అనంతపురం శ్రీకంఠం సర్కిల్: సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసే వీడియోలు, సందేశాల్లో కొన్ని అలజడులకు తావిస్తున్నాయి. నిజమేదో..అబద్ధమేదో తెలుసుకోలేని స్థితి. చాలామంది నిజమని నమ్మే పరిస్థితులు దాపురించాయి. దీంతో అనంతపురం పోలీసులు అసత్య ప్రచారాలకు చెక్ పెట్టేందుకు సాంకేతికతను ఉపయోగించి ఒక నంబరును అందుబాటులోకి తెచ్చారు. ఇకపై సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ అయ్యే వీడియోలు గానీ, వార్తలు గానీ మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంటే 'ఫ్యాక్ట్ చెక్' 99898 19191 నంబరుకు వాట్సాప్ పంపితే మీ అనుమానాలు తీరుతాయి. మెసేజ్‌లు, వీడియోలతో ఆందోళన చెందకుండా ఈ సేవలను పొందాలని ఎస్పీ ఫక్కీరప్ప సూచించారు.

డ్రైడేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



మారుతి నగర్‌లో పరిసరాలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారికాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని మారుతీనగర్‌లో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మన ఇంటిని శుభ్రపరుచుకున్న విధంగానే పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రతే అనేక రోగాలకు కారణమని తెలిపారు. అపరిశుభ్రతతో దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమలను నివారించడం ద్వారా రోగాలను దూరం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు, వైద్యాధికారి మౌనిక, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శేఖర్, ఏఎన్‌ఎం రుక్మిణీబాయి, శానిటేషన్ సెక్రెటరీ చంద్రకళ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



జి. వెంకటాంపల్లిలో నవరత్నాల పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దవడుగూరు మండలం జి.వెంకటాంపల్లిలో ఆయన 'ప్రజా సంక్షేమ యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల గురించి వివరించారు. ఈ సందర్భం పెద్దారెడ్డి మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చినందునే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసాతో అన్నదాతలను ఆదుకుంటున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు సచివాలయ – వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. అయితే టీడీపీ కార్యకర్తలు కొందరు అనర్హుల వద్దకు వెళ్లి పథకాలందడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారి మాటలు నమ్మరాదన్నారు.

మూర్ఖుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి

మనుషులను గౌరవించలేని మూర్ఖుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి అని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఎద్దేవా చేశారు. ఎవరైనా మంచి చొక్కా వేసుకుంటే కూడా ఓర్వలేడని, ఉదయాన్నే రైతుల ఇళ్ల ముందు పేడ ఉన్నా అసహ్యించుకుంటాడని విమర్శించారు. ఎవరైనా పని మీద ఇంటి వద్దకు వస్తే కూర్చోండి అని చెప్పే మర్యాద కూడా లేదన్నారు. అలాంటి జ్ఞానం లేని మూర్ఖుడికి రాబోవు ఎన్నికల్లో ఓటు వేస్తే మన వ్యక్తిత్వాన్ని కించపరచుకున్నట్లేనని హెచ్చరించారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెంచి రాజకీయ హత్యలు చేయించడానికి వెనకాడబోడన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

రాప్తాడు: విద్యార్థులకు ప్రణాళికబద్ధంగా విద్యను బోధించాలని ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో లైవ్‌లో వస్తున్న పరీక్షపై చర్చ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సమ్మేటీవ్ పరీక్షల్లో ఎవరెవరికి ఎన్ని మార్కులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులు తమకు మార్కులు బాగా వచ్చాయని తెలపడంతో వారిని ఆర్జేడీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మేటివ్ పరీక్షల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అలాగే మన బడి నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షించాలని కోరారు. జగనన్న విద్యాకానుక కింద ఇచ్చిన ట్యాబ్‌ల పనితీరుపై ఆరా తీశారు. ఇటీవల జరిగిన గేమ్స్, వ్యాసరచన, వకృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అభినందించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ముత్యాలమ్మ, విద్యార్థులు ఉన్నారు.

వైద్య విధాన పరిషత్‌లో నకి'లీలలు'

- తప్పుడు పత్రాలతో ఉద్యోగాలు
- ఒక్కో పోస్టుకు రూ.4 లక్షల ముడుపులు
- కళాశాల లేకున్నా సర్టిఫికెట్లు పొందిన ఘనులు



అనంతపురం సప్తగిరి సర్కిల్: వైద్య విధాన పరిషత్ పోస్టుల భర్తీలో అక్రమాలు వెలుగు చూశాయి. నకిలీ సర్టిఫికెట్లతో పలువురు ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగుల ప్రమేయంతోనే ఈ తతంగం సాగినట్లు తేలింది. వైద్య విధాన పరిషత్ పరిధిలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, ధర్మవరం ఏరియా ఆస్పత్రుల్లో మొత్తం 5 ప్లంబర్ పోస్టుల భర్తీకి 2021 నవంబర్‌లో తొలి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఐటీఐ ప్లంబర్ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే అర్హులని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆ అర్హత కలిగిన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో దానికి బదులుగా ఫిట్టర్, డీజిల్ మెకానిక్ వంటి ఇతర ట్రేడ్‌ను పూర్తి చేసిన వారిని అర్హులుగా ప్రకటిస్తూ ప్రభుత్వం మళ్లీ ఉత్తర్వులు జారీ చేసింది. రెండో నోటిఫికేషన్‌ను 2022 మార్చిలో విడుదల చేసింది. ఆయా నోటిఫికేషన్లలో దరఖాస్తు చేసుకున్న తక్కువ విద్యార్హత కలిగిన అభ్యర్థులను వైద్య విధాన పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల గుర్తించారు. వారికి ఉద్యోగాలు ఇప్పిస్తామని, అందుకు అవసరమైన విద్యార్హత సర్టిఫికెట్లను తామే సమకూరుస్తామని భరోసా ఇచ్చారు. ఇందు కోసం ఒక్కో పోస్టుకు రూ. 4 లక్షలు డిమాండ్ చేశారు. వైద్య విధాన పరిషత్‌లో తాడిపత్రి ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఓ ఫార్మసిస్టు రంగంలోకి దిగి వ్యవహారాన్ని ముందుకు నడిపించాడు. ఈ వ్యవహారంలో ఓ అభ్యర్థి (రాయదుర్గంలో విధులు నిర్వహిస్తున్న) తొలి మొత్తంగా రూ. 1.80 లక్షలను ఓ ఉద్యోగికి ఫోన్ పే ద్వారా పంపాడు. ఉద్యోగం వచ్చిన తరువాత మిగిలిన మొత్తం చెల్లించకపోవడంతో అతని బైక్‌ను రూ.లక్షకు అమ్మి జమ చేసుకున్నారు. తతిమా రూ.1.20 లక్షల్లో రూ.50 వేలను వివిధ పద్ధతుల్లో సర్దుబాటు చేశాడు. ఉద్యోగంలో చేరిన అభ్యర్థులకు వారికి అందించాల్సిన మిగతా నగదును చెల్లించాలని ఒత్తిడి పెట్టడంతో మొత్తం వ్యవహారం బయటికి వచ్చింది. దీంతో అధికారులు అక్రమాలపై విచారణ చేపట్టారు. ఉద్యోగాలు పొందిన వారిలో ఒకరు ముంబైలో కళాశాల లేకున్నా కోర్సు చేసినట్లు సర్టిఫికెట్లు సృష్టించినట్లు గుర్తించారు. తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల్‌లో ఓ ఐటీఐ కళాశాలలో ఇంకొకరు, జిల్లాలోని తాడిపత్రి ఐటీఐ కళాశాలలో మరొకరు కోర్సులు పూర్తి చేసినట్లు నకిలీ సర్టిఫికెట్లు పొందుపరచినట్లు తేల్చారు.

ఉన్నతాధికారిపై ఒత్తిడి

నకిలీ వ్యవహారం బయటికి రావడంతో జాగ్రత్తల కోసం వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారిపై పలువురు తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. వీరిలో ఒకరు తాడిపత్రి ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తుండగా, అనంతపురం ప్రధాన కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌లుగా ఇద్దరు వ్యవహరిస్తున్నారు. వారే ఈ తతంగంలో పూర్తిగా ఉండి ముందుకు నడిపించారు. ఈ వ్యవహారాన్ని బయటికి రాకుండా చూడాలని ఒత్తిడి పెంచుతున్నారు.

నోటీసులు అందించాం

వైద్య విధాన పరిషత్ పరిధిలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు ఫిర్యాదు అందగానే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాం. సర్టిఫికెట్లు నకిలీవని నిర్ధారించుకున్నాం. నివేదికలను ఉన్నతాధికారులకు నివేదించాం. సంబంధిత వ్యక్తులకు నోటీసులు అందించాం.

– డాక్టర్ కృష్ణవేణి, డీసీహెచ్‌ఎస్, వైద్య విధాన పరిషత్, అనంతపురం

● సందడిగా బాలోత్సవం



బాలోత్సవం అంబరమంటింది. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు ఉత్సవం కొనసాగనుంది. తొలిరోజు విద్యార్థులు వివిధ రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అదరగొట్టారు.

8లో

నేడు ఖాద్రీ ఆలయంలో రథసప్తమి వేడుకలు

కదిరి టౌన్: రథసప్తమి సందర్భంగా శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. ఉదయం 6 గంటలకు స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరిస్తామని, అనంతరం శ్రీవారు సూర్యప్రభ వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

మధ్యనవమి ఉత్సవం

మాఘమాసం మధ్య నవమి సందర్భంగా 30వ తేదీ (సోమవారం) ఖాద్రీశుడు సాయంత్రం 5.30 గంటల నుంచి హనుమంత వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నరు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు సరిగ్గా నెల రోజుల తర్వాత ప్రారంభమవుతాయని తెలిపేందుకు ఏటా ఆనవాయిగీ ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

వైద్య, ఆరోగ్యశాఖలో పోస్టు భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టును కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి వీరబ్బాయి తెలిపారు. డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ ఫర్ క్వాలిటీ అసూరెన్స్ పోస్టును భర్తీ చేస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు https:// ananthapuramu.ap. gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తు, విద్యార్హత సర్టిఫికెట్లను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ఫ్లెటైవర్ బ్రిడ్జి కింద గంజాయిని విక్రయిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలసి దాడులు చేశామని పేర్కొన్నారు. గంజాయి విక్రయిస్తున్న కటిక మహ్మద్ మంజూర్, నసారి కిరణ్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పవన్.. పిచ్చిప్రేలాపనలు ఆపు

- రాయలసీమ విద్యావంతుల వేదిక కోఆర్డినేటర్ రాజశేఖరరెడ్డి

పెనుకొండ: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిచ్చి ప్రేలాపనలు ఆపాలని రాయలసీమ విద్యావంతుల వేదిక కోఆర్డినేటర్ రాజశేఖరరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. సీమ హక్కుల గురించి, విభజన చట్టంలోని హామీల గురించి కనీసం కేఆర్ఎంబీ కార్యాలయం ఏర్పాటు గురించి మాట్లాడని పవన్‌కళ్యాణ్ రాయలసీమ రాష్ట్ర ఉద్యమకారుల తోలు తీస్తాననడం ఆయన కుసంస్కారానికి , అహంకారానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రం సమైక్యంగా ఉండాలనుకుంటే అలానే పవన్ కళ్యాణ్ ప్రచారం చేసుకోవాలని, ఇందులో ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే భిన్నాభిప్రాయాలున్నవారి తోలు తీస్తానంటే తస్మాత్ జాగ్రత్త అని రాజశేఖరరెడ్డి హెచ్చరించారు.

సందడిగా బాలోత్సవం

తామంతా కేవలం చదువులకే పరిమితం కాదు. ఏ రంగంలోనైనా తీసిపోమని ఆ విద్యార్థులు చాటిచెప్పారు. రంగస్థలంపై అడుగు పెడితే ఎవరైనా కేరింతలు కొట్టాల్సిందేనని నిరూపించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఏటా నిర్వహించే బాలోత్సవంలో ఆడిపాడారు.



ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో బాలిక

- ఆటపాటలతో ఆహ్లాదకరంగా ప్రారంభం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న బాలబాలికలు
- చదువుతో పాటు కళల్లోనూ చిన్నారులను ప్రోత్సహించాలన్న వక్తలు

అనంతపురం కల్చరల్: చిన్నారుల సృజనకు అద్దం పట్టేలా మూడురోజుల పాటు సందడిగా సాగనున్న బాలోత్సవం శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమైంది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బాలబాలికలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల మధ్య ప్రతిభ చాటుకున్నారు.

ప్రతి వేదికపై జాలువారిన సృజన..

తొలిరోజు పిల్లల పండుగను దిశ డీఎస్పీ ఆర్లశ్రీనివాసులు, బాలోత్సవ్ కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీవుల్లా చిన్నారులతో కలిసి జాతీయ జెండాను, బాలోత్సవ్ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. బాలోత్సవం ప్రాంగణాన్ని జిల్లాకు చెందిన ప్రముఖుల పేర్లతో ఏర్పాటు చేసి వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. నృత్యకళానిలయం వ్యవస్థాపకులు సంధ్యామూర్తి శిష్యబృందం శ్రీధరి, వర్ణిక గణేష స్తుతిపై శాస్త్రీయనృత్యంతో, లాలిత్య బృందం వందేమాతరంతో బాలోత్సవ సందడికి శ్రీకారం పలికారు. అనంతరం వివిధ వేదికలపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కర్రసాము, జానపద, శాస్త్రీయ నృత్యాలు, సైన్సు ఎగ్జిబిషన్, శాస్త్రీయ సంగీతం, బొమ్మలు చేయడం వంటి పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సృజనను చాటుకున్నారు. ముఖ్యంగా చిన్నారుల దేశభక్తుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి.

బాల్యాన్ని చిదిమేయొద్దు..

ఎంతో అందమైన బాల్యాన్ని చిదిమేస్తున్నారని వారిని హాయిగా ఆటపాటల్లో గడపనివ్వాలని మార్కులు, ర్యాంకుల గోల వద్దని పలువురు సాహితీవేత్తలు తల్లిదండ్రులకు సూచించారు. జెండా ఆవిష్కరణ అనంతరం జరిగిన సమావేశానికి బాలోత్సవ కమిటీ చైర్మన్ షమీమ్ షఫీవుల్లా అధ్యక్షత వహించారు. డీఎస్పీ ఆర్లశ్రీనివాసులతో పాటు సీనియర్ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, ఆర్ట్స్‌కళాశాల ప్రిన్సిపాల్ దివాకరరెడ్డి, సాహితీవేత్తలు తరిమెల అమరనాథరెడ్డి, చెట్ల ఈరన్న, జిలాన్‌బాషా, నబీరసూల్, రియాజుద్దీన్, ఎల్కేపి అధ్యక్ష కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, పద్మజ, పోతుల నాగరాజు, బాలోత్సవ్ ప్రతినిధులు ఐద్వా సావిత్రి, శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. భాష పట్ల మమకారం , కళల పట్ల అనురక్తి, క్రీడల, వైజ్ఞానిక విషయాల పట్ల ఆసక్తిని పెంచడానికి నిర్వహిస్తున్న బాలోత్సవం ప్రతి ఏటా జరుగుతుండటం ఆనందదాయకమన్నారు. సెల్‌ఫోన్లకు, కంప్యూటర్లకు పరిమితం అయిపోతున్న చిన్నారులు అందులో మంచిని గ్రహించి భవితను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులందరికీ సాయిట్రస్టు ప్రతినిధులు అన్ని వసతులు కల్పించారు. అలాగే సాయంత్రం సమావేశంలో పలువురు సాహితీవేత్తలు, అధికారులు ఆత్మీయ అతిథులుగా వివిధ పాఠశాలల చిన్నారులకు జ్ఞాపికలనందించారు. సీపీఎం జిల్లాకార్యదర్శి రాంభూపాల్, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యాత జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, ఎల్ఆర్ వెంకటరమణ వ్యవహరించారు.

సృజనను ప్రోత్సహించాలి

బాలల్లో సహజంగా దాగుండే సృజనను గుర్తించి ప్రోత్సహించాలని ఇన్‌చార్జి డీఈఓ కృష్ణయ్య అన్నారు. బాలోత్సవానికి ఆయన శుక్రవారం సాయంత్రం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎప్పుడూ చదువుతో ఒత్తిడిలో ఉండే బాలబాలికలకు బాలోత్సవం ఆనందం, ఆహ్లాదాన్ని కలిస్తుందన్నారు. వేడుకలకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులందించారు. డీఈఓ వెంట సూపరింటెండెంట్ ఆదినారాయణ, బాలోత్సవం ప్రతినిధులు జలీల్ తదితరులున్నారు.



వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న బాలబాలికలు



సైన్సు ఎగ్జిబిషన్‌లో నమూనాలను ప్రదర్శిస్తున్న బాలికలు



చిన్నారులకు బహుమతులందిస్తున్న డీఈఓ కృష్ణయ్య

లోకేష్‌ను సొంత పార్టీ నేతలే నమ్మరు

- అన్ని పార్టీలూ కలసి వచ్చినా గెలుపు వైఎస్సార్‌సీపీదే
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: నారా లోకేష్ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రుద్రంపేటలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ, లోకేష్ పట్ల ప్రజల్లో ఎలాంటి విశ్వాసం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో స్వార్థ రాజకీయాలు, అవినీతిని చూసే ప్రజలు వారిని గత ఎన్నికల్లో రిజెక్ట్ చేశారన్నారు. 9 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు సంక్షేమ పాలన ఇవ్వకపోగా స్వర్గీయ ఎన్టీఆర్ తీసుకువచ్చిన కిలో రూ.2 బియ్యాన్ని నీరుగార్చారన్నారు. లోకేష్ పట్ల ప్రజలు మాత్రమే కాదు వారి పార్టీలోని వారికి కూడా నమ్మకం లేదన్నారు. పాదయాత్ర చేసినంత మాత్రాన టీడీపీ అధికారంలోకి వస్తుందనుకుంటే వారి భ్రమనేనన్నారు. అలాగైతే అందరూ పాదయాత్ర చేస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో పూర్తి విశ్వాసముందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 145 రోజులుగా కొనసాగుతోందని, సంక్షేమ పథకాలతో ప్రజలు పొందుతున్న ఆనందాన్ని కళ్లారా చూస్తున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి పీఠం నుంచి దించడానికి అన్ని పార్టీలు కలిపేలా టీడీపీ కుట్ర చేస్తోందన్నారు. పాదయాత్రకు సంబంధించి అధికారంలో ఉన్న వారు, ప్రతిపక్షంలో ఉన్న వారు, అందరూ పోలీసుల అనుమతి తీసుకోవాల్సిందేనన్నారు. ఎల్లో మీడియా ద్వారా పాదయాత్రకు అడ్డంకులు సృష్టిస్తున్నట్లు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రెండున్నర లక్షల మంది యువతకు సచివాలయం, ఆరోగ్యశాఖ ద్వారా వేలాది ఉద్యోగాలిచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అదేవిధంగా మూడు లక్షల మందికి వలంటీర్లుగా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం గతంలో చేయని విధంగా యువతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేలు చేస్తోందన్నారు. నారా లోకేష్ పాదయాత్ర, ప్రతిపక్ష పార్టీలన్నీ కలసి వచ్చినా వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని, ప్రజలకు తమ పార్టీ పట్ల అపారమైన విశ్వాసం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

జమునతో 'అనంత ' బంధం

అనంతపురం కల్చరల్: తెలుగు ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా ముద్ర వేసుకున్న సినీనటి జమున మరణం పట్ల జిల్లా కళాకారులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు. విలువలతో కూడిన వ్యక్తిత్వంతో ఎంతోమందికి ఆత్మీయురాలిగా మారిన జమునకు ఉమ్మడి అనంతపురం జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. పుట్టపర్తి సత్యసాయిబాబాకు పరమ భక్తురాలు అయిన జమున ఆయన జన్మదినాల సమయాలలో తరచూ పుట్టపర్తికి వచ్చేవారు. జమునను అనంతపురం నగరానికి చెందిన సినీ అభిమాని వరం వేంకటేశ్వర్లు నేతృత్వంలో 'అనంత కళావాహిని సంస్థ' 2010లో ఘనంగా సత్కరించి కనకాభిషేకం చేశారు. స్థానిక లలితకళాపరిషత్తులో జరిగిన వేదికపై జమున ఇక్కడి వారితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కోనసీమ వరద బాధితుల సహాయార్థం ప్రముఖ సినీనటులతో కలిసి రాయలసీమ అంతటా పర్యటించిన అనుభవాలను పంచుకున్నారు. జమున మృతి పట్ల అనంత కళావాహిని ప్రతినిధులు వరం వేంకటేశ్వర్లు, రమేష్ నీల్, వరప్రసాద్ తదితరులు తమ సంతాపాన్ని ప్రకటించారు. జమున లాంటి అరుదైన నటీమణులు మళ్లీ రావడం అసాధ్యమని , ఆమె లేని లోటు పూడ్చలేనిదని విచారం వ్యక్తం చేశారు.



అనంతకు వచ్చిన సందర్భంలో జమునతో జిల్లా కళాకారులు (ఫైల్)

'దుర్గం'లో జమున కుటుంబీకులు

రాయదుర్గంటౌన్: తెలుగు చలన చిత్రసీమలో కథ నాయికగా ఎదిగిన నటి జమునకు రాయదుర్గంతో విడదీయరాని బంధం ఉంది. జమున తండ్రి నిప్పాణి శ్రీనివాసరావు సోదరుల కుటుంబాలు నేటికీ రాయదుర్గంలోని కోట వద్ద ఉన్నాయి. జమున పెద్దనాన్నలు నిప్పాణి రంగరావు, నిప్పాణి శివనారాయణమూర్తి కుటుంబాలు స్థానికంగానే నివాసం ఉన్నాయి. జమున ఇక లేరనే విషయాన్ని తెలుసుకున్న కుటుంబీకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సొంత మేనత్త జమున మృతి తీరని లోటని అల్లుడు సుధీర్ తెలిపాడు.

యువగళంతో టీడీపీకి సర్వమంగళమే

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



తాడిపత్రి: నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన యాత్ర టీడీపీకి సర్వమంగళం పాడనుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడుతూ బాబు వస్తే జాబు అంటూ, నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వకుండా నిరుద్యోగ యువతను మోసం చేసినందుకు ముందుగా నారా లోకేష్ తన ముక్కును నేలకు రాసి క్షమాపణ చెప్పాలన్నారు. జయంతికి, వర్ధంతికి తేడా తెలియని, మంగళగిరిని మందలగిరని ఉచ్చరించే ఇలాంటి దద్దమ్మ పాదయాత్ర చేయడం వల్ల ఒరిగిందేమీలేదన్నారు. ఇలాంటి వ్యక్తి చేసే పాదయాత్రను అడ్డుకోవాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీకి లేదన్నారు. పాదయాత్రకు అనుమతి కోరారు, వారి ఫ్లెక్సీలు వారే చించుకుంటారు మళ్లీ అధికార పక్షంపై నిందలు మోపి, క్రేజ్‌తో పాటు హైప్‌ను పెంచుకుంటూ తప్పుడు ప్రచారాలు చేయడం టీడీపీకి అలవాటైందని విమర్శించారు. కందుకూరు, గుంటూరుల్లో చంద్రబాబు ప్రచార పిచ్చితో 11 మందిని పొట్టనబెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ పాదయాత్ర చేస్తాను అంటుంటే ప్రజలు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. తండ్రీ కొడుకులు రాష్ట్రానికి ఐరన్ లెగ్‌లాంటివారని, వీరు అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరువు విలయతాండవం చేసి, ప్రజలు సర్వనాశం అవుతారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు చాలా సంతోషంగా జీవిస్తున్నారని, మళ్లీ ఆయనే సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అంతే తప్ప లోకేష్ పాదయాత్ర వలన అధికారంలోకి టీడీపీ వస్తుందనుకోవడం వారికి కలగానే నిలిచిపోవడం ఖాయమని పైలా జోస్యం చెప్పారు.

క్యాష్ రివార్డుల పేరుతో మోసాలు

- సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని ఎస్పీ ఫకీరప్ప విజ్ఞప్తి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: హాయ్... హలో అంటూ ఫోన్ పే, గూగుల్ పే కంపెనీల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌తో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఫోన్‌పే, గూగుల్ పేలో రివార్డ్ అమౌంట్ ఉందంటూ అగంతకులు చాలా మందికి ఫోన్ చేస్తున్నట్లు తెలిపారు. మీరు ఆ అమౌంట్‌ను వినియోగించుకోలేదని మాయ మాటలు చెబుతున్నారన్నారు. ఆ డబ్బు వినియోగించుకోకపోతే వెనక్కి వెళ్లిపోతుందంటూ మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌పై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొదటగా ఫోన్ పే యాప్ ఓపెన్ చేయమంటారని, తర్వాత ఒక పే రిక్వెస్ట్‌కు సంబంధించిన నోటిఫికేషన్ కనిపిస్తుందన్నారు. వారి మాయ మాటలతో పే ఆప్షన్‌పై క్లిక్ చేసి పిన్ నంబర్ ఎంటర్ చేయగానే ఖాతా నుంచి డబ్బులు వారి అకౌంట్‌లోకి జమ అవుతాయన్నారు. సైబర్ నేరగాళ్లకి డబ్బుకట్ అయ్యాయని చెప్పినా.. మీరు ఈ కాల్ పూర్తిచేయగానే ఖాతాలో డబ్బు జమ అవుతుంది అని సమాధానమిస్తారన్నారు.

1930 నంబర్‌కు ఫిర్యాదు చేయండి

ఫోన్‌పే, గూగుల్‌పే తదితర వాటి పేరుతో క్యాష్ రివార్డులందరూ ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మొద్దని ఎస్పీ ఫకీరప్ప ప్రజలకు సూచించారు. మీరు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడంతో వచ్చిన రివార్డును మీరు ఆ సంబంధిత పే రిక్వెస్ట్ లేదా రిసీవ్ రిక్వెస్ట్ చెక్ చేసుకోవాలని, తెలియని లింకులపై మాత్రం ఎలాంటి పరిస్థితుల్లో క్లిక్ చేయదన్నారు. ఫోన్‌పే, గూగుల్ పే కంపెనీ ప్రతినిధులు కస్టమర్లకు ఫోన్ చేయరన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఎవరైనా ఈ విధంగా మోసపోతే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి విజ్ఞప్తి చేశారు.

సిమెంట్ లారీని ఢీ కొన్న కంటైనర్

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో బెంగళూరు వైపు వెళుతున్న సిమెంట్ లారీని అనంతపురం వైపు వెళ్ళే కంటైనర్ ఢీ కొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కంటైనర్ వాహనం అదుపుతప్పి బెంగళూరు వైపు వెళ్లే సిమెంట్ లారీను ఢీ కొనడంతో పాపిరెడ్డిపల్లి చెరువు మరువ వెళ్లే కాలువ (గుంత)లో దూసుకెళ్లింది. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన సిమెంట్ లారీ డ్రైవర్ సెంథిల్ మురుగన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ మురళి సంఘటనా స్థలానికి చేరుకొని స్వయంగా లారీ క్యాబిన్ నుంచి క్షతగాత్రుడిని బయటకు తీసుకొచ్చారు. మురగన్‌ను వెంటనే పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సహాయక చర్యల్లో పాల్గొన్న ఏఎస్‌ఐ మురళి

చెరువులో చిక్కుకున్న గొర్రెలు

- 72 జీవాల ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- ఆరు మృతి. 42 గొర్రెల ఆచూకీ గల్లంతు

మడకశిరరూరల్: మడకశిర చెరువులో శుక్రవారం నీరు తాగడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి మునిగి కంప చెట్లలో ఇరుక్కుపోయిన గొర్రెలను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. మొత్తం 120 గొర్రెలు చిక్కుకోగా 78 జీవాలను బయటకు తెచ్చారు. అందులో ఆరు గొర్రెలు చనిపోయారు. మిగతా 42 గొర్రెల ఆచూకీ గల్లంతైంది. వివరాల్లోకెళితే... మెళవాయి గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు పూజారి ప్రభాన, కమ్మరి శివప్ప పొలాల్లో మేత వేయించి మడకశిర చెరువులో నీటిని తాపించడానికి గొర్రెలను తోలుకెళ్లారు. చెరువులోని రోడ్డుపై నీరు ఉన్న కల్వర్ట్ వద్ద నీరు తాగుతుండగా ప్రమాదవశాత్తూ గొర్రెలు రోడ్డుపై నుంచి చెరువుకి పడిపోయి నీటిలోని కంపచెట్లుల్లో ఇరుక్కుపోయాయి. గమనించిన కాపర్లు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక అధికారి విజయకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకొని నీటి మునిగి కంపచెట్లుల్లో ఇరుక్కుపోయిన 78 గొర్రెలను ఒక్కొక్కటిగా బయటికి తీసుకొచ్చి పశువైద్య అధికారులతో పశువైద్య చికిత్సలు చేయించారు. అయితే ప్రమాదంలో 6 గొర్రెలు మృతి చెందాయని అగ్నిమాపక అధికారి తెలిపారు. 120 గొర్రెల్లో 78 గొర్రెలను అగ్నిమాపక అధికారులు బయటికి తీశారని మిగిలినవి నీటినిలో మునిగిపోయాయని గొర్రెల కాపర్లు తెలిపారు. మృతి చెందిన గొర్రెలను వీఆర్‌ఓ నరేష్, సర్పంచ్ రంగనాథ్ పరిశీలించి జరిగిన నష్టాన్ని కాపర్లను అడిగి తెలుసుకున్నారు. పశువైద్య అధికారులు మృతి చెందిన గొర్రెలకు శవపరీక్ష నిర్వహించారు. నష్టపోకుండా ఆదుకోవాలని కాపర్లు విజ్ఞప్తి చేశారు. అగ్నిమాపక సిబ్బంది సేవలను స్థానికులు అభినందించారు.



చెరువులో నీట మునిగిన గొర్రెలను బయటకు తీసుకొస్తున్న దృశ్యం

క్లుప్తంగా

నేడు దేశభక్తి గీతాల పోటీలు

అనంతపురం కల్చరల్: సంస్కార భారతి ఆధ్వర్యంలో శనివారం దేశభక్తి గీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధానకార్యదర్శి లక్ష్మి తెలిపారు. నగరంలోని శ్రీ సాయిబాబా నేషనల్ (ఎస్ఎస్‌బీఎన్) కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగే ఈ పోటీల్లో ఆసక్తి కల్గిన వారు నేరుగా పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 63034 63700 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫౌంటేన్ ప్రారంభం

అనంతపురం క్రైం: నగరంలోని 12వ డివిజన్ మొరార్జీ దేశాయ్ స్కూల్ ముందు ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటేన్‌ను మేయర్ వసీం శుక్రవారం ప్రారంభించారు. డివిజన్ సుందరీకరణ కోసం వాల్ పెయింటింగ్, ఫౌంటెన్ ఏర్పాటు, మొక్కల పెంపకం చేపట్టిన కార్పొరేటర్ బాబా ఫకృద్దీన్‌ను మేయర్ కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాబాఫకృద్దీన్, అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషన్, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తినిపించాలి

అంగన్‌వాడీ కేంద్రంలోనే చిన్నారులకు పౌష్టికాహారం తినిపించాలని మేయర్ ఆదేశించారు. శుక్రవారం 12వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని మేయర్ పరిశీలించారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు.

డీఎస్ఈ సునీల్‌నాయక్‌కు సన్మానం



డీఎస్ఈని సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

అనంతపురం సెంట్రల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న జలవనరులశాఖ డిప్యూటీ ఎస్ఈ సునీల్‌నాయక్‌ను శుక్రవారం ఆయన చాంబర్‌లో ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రమూర్తి, జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శిఖర ప్రతిష్టలు

అనంతపురం కల్చరల్: నగరంలోని రైల్వే కాలనీలో గల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం శిఖర కలశ ప్రతిష్టలు శాస్త్రోక్తంగా సాగాయి. వేదపండితులు ఆలూరు రమేష్‌శర్మ, పిడతల సీతారామశర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి హోమాలు, కలశ ప్రతిష్టలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు ద్వారకా చంద్రమోహనరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసుల నాయుడు, గోవిందరాజులు, కార్పొరేటర్ మల్లికార్జున తదితరులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు వాహనాల వేలం

రాప్తాడు: ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఎస్ఐ పీవై ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'సెబ్' అధికారుల సమక్షంలో ఉదయం 10 గంటలకు ఒక కారు, 4 ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఆధార్ కార్డుతో పాటు రూ.3 వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నూతన ఆర్జేడీకి అభినందనలు



ఆర్జేడీకి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

అనంతపురం: విద్యాశాఖ నూతన ఆర్జేడీ బి.ప్రతాప్‌రెడ్డికి శుక్రవారం అనంతపురంలో ఇన్‌చార్జ్ డీఈఓ ఎస్.కృష్ణయ్య, డీవైఈఓ పద్మప్రియ తదితరులు అభినందనలు తెలిపారు. గతంలో అనంతపురం డీఈఓగా ప్రతాప్‌రెడ్డి సమర్థవంతంగా విధులు నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. అనంతరం రాప్తాడు కేజీబీవీ, మోడల్ స్కూల్‌ను ఆర్జేడీ సందర్శించారు.

ఇష్టపడి చదివితే మెరుగైన ఫలితం

ఆత్మకూరు: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మెరుగైన ఫలితాలు వస్తాయని ఎంఈఓ నరసింహారెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఆత్మకూరు, తోపుదుర్తి ఉన్నత పాఠశాలలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ...ప్రతి సబ్జెక్టుకు కొంత సమయం కేటాయించి చదవాలని, ఆ తర్వాత రివిజన్ చేసుకుంటే పరీక్షల్లో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. పాఠశాలలో ప్రత్యేకంగా స్టడీ అవర్స్ కేటాయించి పదో తరగతి విద్యార్థులను చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టం

- చంద్రబాబు ఎన్ని డ్రామాలాడినా ప్రజలు నమ్మరు
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత



రుద్రంపేట పంచాయతీలో ప్రభుత్వ పథకాల లబ్ధి గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీకే ప్రజలు మళ్లీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రుద్రంపేట పంచాయతీలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, వైస్ ఎంపీపీ బాలాజీ, సర్పంచ్ పద్మావతితో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఎన్ని పార్టీలతో జత కట్టినా వైఎస్సార్‌సీపీ ముందు నిలవలేవన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎన్ని డ్రామాలాడినా ప్రజలు నమ్మరని అన్నారు. లోకేష్ పాదయాత్ర వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. 2014లో టీడీపీ ఇచ్చిన ఎన్నికల హామీల అమలు గురించి ప్రజలకు చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రుద్రంపేట పంచాయతీలో మూడేళ్ల కాలంలో రూ.కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే అనంత అన్నారు. గతంలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లు దర్శనమిచ్చేవని, నేడు ఏ కాలనీ చూసినా సిమెంట్ రోడ్లు, డ్రైయిన్లతో సుందరంగా ఉందన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రకుమార్, ఎంపీటీసీ మహబూబ్‌బీ, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, మైనార్టీ నాయకుడు గౌస్‌బేగ్, సాధిక్‌వలి, కృష్ణవేణి, అనిల్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ రాజు నాయక్, నాయకులు కుళ్లాయప్ప, గోవిందరెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, మల్లెల వేణుగోపాల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

దేవుడిలామేలు చేస్తున్నారు

అనంతపురం క్రైం: 'జిరాక్స్ సెంటర్‌లో చాలీచాలని వేతనంలో పని చేసే తనకు అమ్మఒడి, రైతు భరోసా, నా భార్యకు చేయూత ఇలా వివిధ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవుడిలా మేలు చేస్తున్నారు' అని లక్ష్మీనగర్‌కు చెందిన రోషన్‌సాహెబ్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో ఆనందం పంచుకున్నాడు. శుక్రవారం నగరంలోని 39వ డివిజన్ లక్ష్మీనగర్‌లో వైఎస్సార్‌సీపీ నేత చింతకుంట మధుతో కలసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే డబ్బును పిల్లల భవిష్యత్తుతో పాటు తన ఆరోగ్యం కోసం వినియోగించుకుంటున్నట్లు రోషన్‌సాహెబ్ తెలిపాడు. కూరగాయల వ్యాపారం చేసుకునే తనకు ప్రభుత్వం అమ్మఒడి, చేయూత అందించి ఆదుకుందని రమణమ్మ అనే వితంతువు సంతోషం వ్యక్తం చేసింది. చేయూత ద్వారా అందిన సాయం ఎంతో ఉపయోగపడిందని రహమత్ బీ అనే మహిళ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించింది.

రోడ్డు ఆక్రమణలు కానివ్వొద్దు

నిర్మాణాలు జరిగే సమయంలో రోడ్డు ఆక్రమణలకు గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగానిదేనని ఏసీపీ శ్రీనివాసులరెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. లక్ష్మీనగర్‌లో పలువురు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతుంటే వాటిని పరిశీలించిన ఎమ్మెల్యే రోడ్డుకి ఇబ్బంది లేకుండా చూడాలని యజమానులకు సూచనలివ్వాలన్నారు. లక్ష్మీనగర్ – పీటీసీకి మధ్యలో ఉన్న కాలువపై చేపట్టిన నిర్మాణాలను పరిశీలించి, కాలువ వెడల్పునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈ రాంప్రసాద్‌రెడ్డి, ఎమినిటీ సుప్రజను ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, కార్పొరేటర్లు శ్రీనివాసులు, సంపంగి రామాంజినేయులు, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి,గోయిందు, జావెద్, శ్రీదేవి, గౌరి, రామయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి



హెల్మెట్ ధరించి బైక్ నడుతుపున్న సీఐ విజయభాస్కర్‌గౌడ్

రాప్తాడురూరల్: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని అనంతపురం రూరల్ సీఐ విజయభాస్కర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సీఐ, ఎస్ఐలు, సిబ్బంది హెల్మెట్లు ధరించి బైకులు నడిపారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా అత్యంత సున్నితమైన తలకు బలమైన గాయాలై మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్ అనేది తలకు చాలా రక్షణగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు.

మహిళ అదృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం మండల పరిధిలోని నందమూరినగర్‌కు చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... నందమూరినగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ రహీమ్ కుమార్తె షేక్ పర్వీన్ ఈ నెల 25న ఉదయం 6 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. మళ్లీ తిరిగి రాలేదు. పెంపుడు తల్లి భానూజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం

- రోడ్డు భద్రతా వారోత్సవాల్లో 'దిశ' డీఎస్పీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, చిత్రంలో జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్. ఆదోని

అనంతపురం క్రైం: సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని 'దిశ' డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథి డీఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది మద్యపానం, ధూమపానం, తదితర వ్యసనాలకు బానిసలు కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. బస్సులోని ప్రయాణికులతో పాటు మీ ప్రాణాలు కూడా ఎంతో విలువైనవన్నారు. పొరపాటున ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గ్యారేజీ సిబ్బంది కండీషన్ కల్గిన బస్సులను డ్రైవర్లకు అందించాలన్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి సుమంత్ ఆర్ ఆదోని మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న వాహన డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపినప్పుడు ఆర్టీసీ డ్రైవర్ రక్షణాత్మకంగా డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా గతేడాది నవంబర్‌లో 240 మంది డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించామన్నారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 40 ఏళ్లు దాటిన వారికి కంటి చూపు, గుండె సంబంధిత, తదితర సమస్యలపై ఆర్టీసీ వైద్యునితో స్క్రీనింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోజూ బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించి.. ఎవరైనా మద్యం తాగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి, జీరో ప్రమాదాల రీజియన్‌గా 'అనంత'ను నిలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఎం శంకర్, అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్, సూపరింటెండెంట్ నాగార్జున, ఉద్యోగ సంఘాల నాయకులు సోమశేఖర్‌రెడ్డి, వైకే మూర్తి, మాధవయ్య, ఖాన్, కల్లప్ప, పాల్గొన్నారు.

క్షతగాత్రునికి పరామర్శ

రాప్తాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎం.బండమీదపల్లికి చెందిన బోయ సుధాకర్‌ను శుక్రవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, మండల యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలా ఉండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

గాయపడిన మహిళ మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాధ (37) అనే మహిళ శుక్రవారం మృతి చెందింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని లక్ష్మీనగర్‌లో రాధ, వీరముద్ది దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు సంతానం. భర్త చిన్నా చితకా పనులు చేసి తెచ్చే సంపాదన చాలకపోవడంతో రాధ పలువురి ఇళ్లల్లో పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేది. గురువారం సాయంత్రం రాధ నీలం సంజీవరెడ్డి భవనం ముందు కాలనీలోని ఓ ఇంటిలో పనిచేసే పనిమనిషి అనంతమ్మతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి నడుచుకుంటూ బయల్దేరింది. ఇంతలో వేగంగా వచ్చిన కారు రాధను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాధను ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. సమాచారం అందుకున్న లక్ష్మీనగర్ వాసులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. మృతురాలి భర్త ఫిర్యాదు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మిత్రుల ఘర్షణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఇద్దరు మిత్రుల మధ్య ఓ చిన్న విషయమై ఘర్షణ జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... మంజునాథ్, నాగార్జున అనే మిత్రులు శుక్రవారం సాయంత్రం టీస్టాల్ వద్ద ఓ చిన్న విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. పరస్పర దాడుల్లో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రిటైర్డు వయసు 62కు పెంచాలి



ఏపీయూఎన్‌టీఈఏ నూతన అధ్యక్షుడు వై.వెంకటప్పరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

అనంతపురం: యూనివర్సిటీల్లోని బోధనేతర సిబ్బంది ఉద్యోగ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని ఎస్కేయూ బోధనేతర సంఘం కోరింది. ఏపీయూఎన్‌టీఈఏ నూతన అధ్యక్షుడి వై.వెంకటప్పరెడ్డి, గౌరవ కార్యదర్శి టి.పురుషోత్తంరెడ్డి, జనరల్ సెక్రెటరీ జి.సురేంద్రబాబు, ట్రెజరర్ షేక్ అహమ్మద్ బాషా, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జె.గౌతమ్ నాయుడు శుక్రవారం ఎస్కేయూ, జేఎన్‌టీయూఏను సందర్శించారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, జేఎన్‌టీయూఏ వీసి ప్రొఫెసర్ జింకా రంగజనార్దనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్కేయూలో ఏపీయూఎన్‌టీఈఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో పలు అంశాలపై చర్చించారు. పెండింగ్ డీఏల విడుదల, 12వ పీఆర్సీ సకాలంలో మంజూరు చేయాలని, వర్సిటీ ఉద్యోగుల జీతభత్యాలకు సరిపడా బ్లాక్ గ్రాంట్‌ను బడ్జెట్‌లో కేటాయించాలని తీర్మానించారు. యూనివర్సిటీ ఉద్యోగులను ఎన్‌జీఓలుగా పరిగణించి వారికి కల్పిస్తున్న సౌకర్యాలు వర్తింపజేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, టైం స్కేలు ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని తీర్మానంలో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఏపీయూఎన్‌టీఈఏ నూతన రాష్ట్ర అధ్యక్షుడు వై.వెంకటప్పరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్కేయూ బోధనేతర సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, జనరల్ సెక్రెటరీ శాంతలింగం, ఉపాధ్యక్షుడు రాము, ఆర్గనైజింగ్ సెక్రెటరీ లింగమయ్య, విశ్వ ఉద్యోగి మాస పత్రిక ఎడిటర్ నాగప్పగారి ఆనందరాజు, మాజీ సెక్రెటరీ సాకే గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా డైలాగులు నమ్మరు

- సీఎంను విమర్శిస్తే ఊరుకోం
- యువగళం పాదయాత్రతో నిష్ప్రయోజనం
- బాలకృష్ణ, లోకేష్‌పై మేయర్ వసీం ఆగ్రహం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: పాలనలో ఆదర్శంగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని నగరపాలక సంస్థ మేయర్ వసీం సలీం హెచ్చరించారు. పరిపాలన చేత కాదని ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమా డైలాగులు చెబితే ప్రజలు ఎవ్వరూ నమ్మరని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లక్షలాది పేదల కుటుంబాల్లో వెలుగులు నింపిన నవరత్నాలను బాలయ్య రంగు రత్నాలని విమర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నవరత్నాల పథకాల విలువేంటో పేదలకు తెలుసని, మీరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మరని అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ, పోలీసు, ఆరోగ్యశాఖ, తదితర శాఖల్లో లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఏపీలాంటి పరిపాలన వారి ప్రాంతాల్లోనూ రావాలని ఇతర రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారని గుర్తు చేశారు.

లోకేష్ నియోజకవర్గమేదో తేల్చుకోవాలి

టీడీపీ బలోపేతం కోసం యువగళం పేరిట 400 రోజుల్లో 4వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్.. ముందు తన నియోజకవర్గం ఏదో తేల్చుకుని.. అక్కడ తాను గెలుస్తారో లేదో చూసుకోవాలని మేయర్ హితవు పలికారు. స్వార్థ రాజకీయాల కోసం పాదయాత్ర చేపడితే ప్రజలు నమ్మబోరన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా 2024లోనూ తమ సత్తా ఏంటో చూపుతామన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో 40 ఏళ్లలో లేని అభివృద్ధి నగరంలోజరిగిందన్నారు.

ఈ-కేవైసీతోనే రైతులకు లబ్ధి



సనప రైతు భరోసా కేంద్రంలో ఈకేవైసీ చేస్తున్న ఏఈఓ సుజిత

ఆత్మకూరు: ప్రభుత్వం అమలు చేసే పథకాలు, పంట నష్టపరిహారం, రైతు భరోసా తదితర అందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఈఓ సుజిత సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని సనప, మదిగుబ్బ గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించి ఈ-కేవైసీ చేయించారు. గొరిదిండ్లలో 650 మంది, పి. యాలేరులో 457 మంది, ఆత్మకూరులో 240 మంది, సనపలో 188 మంది, మదిగుబ్బలో 167 మంది, తోపుదుర్తిలో 113 మంది, బి.యాలేరులో 103 మంది, తలుపూరులో 32 మంది...ఇలా మండలవ్యాప్తంగా 1,950 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదన్నారు. ఈ-కేవైసీ చేయించుకోవడం కూడా చాలా సులువన్నారు. సెల్‌ఫోన్ ద్వారా కూడా రైతులు ఈ-కేవైసీ పూర్తి చేయవచ్చన్నారు. లేకపోతే సమీపంలోని మీ-సేవ కేంద్రం, గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు. ఈకేవైసీ చేయించుకునే రైతుల ఫోన్ నంబర్, ఆధార్ కార్డుతో లింక్ అయి ఉండాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



స్వామి వారి బంగారు కవచాన్ని ప్రదక్షిణ చేయిస్తున్న కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

పంపనూరులో కల్యాణోత్సవం



ఆత్మకూరు: మాఘమాస శుద్ధ షష్టి సందర్భంగా శుక్రవారం పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యషష్టి వేడుకలు

అనంతపురం కల్చరల్: స్కంద షష్టిని పురస్కరించుకొని నగరంలో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు నేత్రపర్వకంగా సాగాయి. చెరువుకట్ట, శివకోటి, హెచ్చెల్సీ కాలనీ ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు హోమాలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన నాగేంద్ర

ఆత్మకూరు: పంపనూరు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగేంద్ర అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రంగడు తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణదుర్గంలోని ఓ నర్సరీలో కడపకు చెందిన నాగేంద్ర పని చేస్తున్నాడు. శుక్రవారం అనంతపురం వెళ్లిన నాగేంద్ర రాత్రివేళ తిరిగి నర్సరీకి వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. పంపనూరు సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్‌తో బలంగా ఢీకొట్టాడు. ఈఘటనలో నాగేంద్ర తీవ్రంగా గాయపడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ... పోలీసు వాహనంలోనే నాగేంద్రను ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రాథమిక చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు.

మొక్కలను సంరక్షిద్దాం



మొక్కలకు నీరు పోస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం క్రైం: మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత అందరిపైనా ఉందని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని విద్యుత్‌నగర్ నుంచి జేఎన్‌టీయూకు వెళ్లే మార్గంలోని డివైడర్లలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఉన్న మొక్కలను తీసుకువచ్చి నాటించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ సంపంగి రామాంజినేయులు, నాయకులు నాగార్జునరెడ్డి, పాల్గొన్నారు.

జమునకు కళాకారుల సంతాపం

అనంతపురం కల్చరల్: సినీనటి జమునకు 'అనంత' కళాకారులు సంతాపం తెలిపారు. శుక్రవారం రాత్రి నగరంలోని క్లాక్‌టవర్ వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిచారు. ఘంటసాల సంగీత కళాభారతి ప్రతినిధులు సురేష్, శ్రీరాములు, ఆదినారాయణ, శేషాద్రి, కేశవ తదితరులు మాట్లాడుతూ పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో చిరస్మరణీయ పాత్రలు పోషించారని గుర్తు చేసుకున్నారు.

నర్సింగ్ సిబ్బంది సేవలు అమోఘం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నర్సింగ్ సిబ్బంది సేవలు అమోఘమని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. 2022 సెప్టెంబర్ ఇంటెన్సిఫైడ్ బ్యాచ్ 51 మంది నర్సింగ్ శిక్షణకు కర్నూలు నుంచి అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా శుక్రవారం క్యాపింగ్ సెర్మనీ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు నేతృత్వంలో నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 రజిని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు భూపంపిణీ చేయాలి

రాప్తాడు: భూమిలేని నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని వారికి 8వ విడత భూపంపిణీలో న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ లక్ష్మీ నరసింహులుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ.. మిగులు భూముల పంపిణీలో దళిత, గిరిజనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పుల్లలరేవు పెద్దన్న, వెంకటనారాయణ, గొల్లపల్లి శ్రీనివాస్, రామాంజనేయులు, రాము, కర్ణ, నాగరాజు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.